## క్లుప్తంగా

### ప్రతి మొక్కనూ సంరక్షించాలి

**కట్టంగూర్:** వేసవి నేపథ్యంలో నర్సరీల్లోని ప్రతి మొక్కనూ సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అన్నారు. మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో గల నర్సరీని సోమవారం ఆయన ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశరావుతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వారి వెంట ఏపీఓ కడియం రాంమోహన్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

### పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

**మునుగోడు:** పీఆర్‌టీయూ–2024 సంవత్సరం డైరీని సోమవారం ఆ సంఘం నాయకులు మునుగోడు మండల విద్యా వనరుల కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జనగాం వెంకన్న గౌడ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొడ్డేటి నర్సింహ, మిర్యాల మురళి, స్వామి, వెంకటయ్య, విజయ ప్రసాద్, నటరాజ్ పాల్గొన్నారు.

### బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

**నాంపల్లి:** నాంపల్లి మండలంలోని బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ జిలేందర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఎస్ఐ లచ్చిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

### మర్రిగూడ ఎంపీఓగా రవికుమార్

**మర్రిగూడ:** మర్రిగూడ మండల ఎంపీఓగా బండారు రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మాడుగులపల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీఓ ఝాన్సీ ఇటీవల నాంపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

### కుట్టు శిక్షణతో ఉపాధి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగం లక్ష్మి, క్లబ్ ప్రతినిధులు

**నల్లగొండ రూరల్:** కుట్టు మిషన్ శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి కల్పిస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ నల్లగొండ శాఖ అధ్యక్షురాలు సింగం లక్ష్మి అన్నారు. సోమవారం నల్లగొండలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆసక్తి గలవారు ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శివప్రసాద్, గోలి అమరేందర్‌రెడ్డి, కొండపల్లి రేణుక, జెల్లా దశరథ, కోడె సతీష్‌కుమార్, పుట్ట వెంకన్న, అశోక్ రెడ్డి, సరళ, ఏచూరి శైలజ, చంద్రావతి, ఇందిర, రజని, వనమా శోభ, పుష్ప పాల్గొన్నారు.

### జిల్లా అధ్యక్షుడిగా జ్ఞానేంద్రప్రసాద్

**కనగల్:** మానవ హక్కుల సంరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కనగల్ మండలం రేగట్టె గ్రామానికి చెందిన యర్రోళ్ల జ్ఞానేంద్ర ప్రసాద్‌ను నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శివానందం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శివానందంకు జ్ఞానేంద్ర ప్రసాద్ కతజ్ఞతలు తెలిపారు.

### ఒకరికి స్వల్ప గాయాలు

**మర్రిగూడ:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వద్ద ఓ సెల్‌ఫోన్ కంపెనీ నెట్‌వర్క్ కనెక్షన్ పైపులైన్ కోసం గాతు తవ్వి రోడ్డుపై పోసిన మట్టి కారణంగా సోమవారం ఓ ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి స్వల్ప గాయాల పాలయ్యాడు. స్థానికుల వివరాలు ప్రకారం శివన్నగూడ గ్రామానికి చెందిన మోర రామచంద్రం మాల్ నుంచి గ్రామానికి వస్తున్నాడు. రోడ్డుపై మట్టి ఉండడంతో బైక్ అదుపుతప్పి కింద పడగా స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

### తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**నాంపల్లి:** ముప్పై ఏళ్ల క్రితం ఉద్యోగుల సంఘం భవనం కోసం నాంపల్లిలో కొనుగోలు చేసిన స్థలాన్ని తప్పుడు పత్రాలను సృష్టించి అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ అన్నారు. సోమవారం ఉద్యోగుల స్థలం వద్ద ఉపాధ్యాయులతో బోర్డు ఏర్పాటు చేసి మాట్లాడారు. దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని, విచారణ పూర్తి కాకముందే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఇందుకు అనుమతులిచ్చిన కార్యదర్శిని సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు సిలువేరు నారాయణ, జంపాల అనిల్, ప్రజానాట్యమండల జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, కత్తి కృష్ణారెడ్డి, పున్న కృష్ణయ్య, సీత వెంకటయ్య, కురుపాటి సత్తీష్, నక్క గిరి, విజయ్‌భాస్కర్ ఉన్నారు.

### ఎమ్మెల్యేకు వినతి

**నకిరేకల్:** నకిరేకల్ పట్టణంలో శాశ్వత యోగా ధ్యాన మండలి భవనం నిర్మించాలని ఆ మండలి కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే వీరేశం సానుకూలంగా స్పందించారని మండలి అధ్యక్షుడు పైళ్ల శశిధర్‌రెడ్డి తెలిపారు.

# రహదారిపైనే నిరీక్షణ

- చిట్యాల బస్టాండ్ లోపలికిరాని అన్ని ఆర్టీసీ బస్సులు
- కొన్ని సర్వీసులు మాత్రమే వచ్చి వెళ్తున్నాయంటున్న ప్రయాణికులు
- ఎక్కడికి వెళ్లాలన్నా హైవే మీదకొచ్చి నిలబడాల్సిందే..
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



చిట్యాల బస్‌స్టేషన్ ఎదుట హైవేపై బస్సు కోసం నిల్చున్న ప్రయాణికులు



చిట్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో నిరుపయోగంగా ఉన్న మంచినీటి ట్యాంకు

**చిట్యాల:** చిట్యాల మున్సిపల్ కేంద్రంలో అన్ని వసతులతో కూడిన ఆర్టీసీ బస్‌స్టేషన్ ఉన్నప్పటికీ ప్రయాణికులందరికీ ఉపయోగపడడం లేదు. ప్రతి ఆర్టీసీ బస్ సర్వీసు బస్‌స్టేషన్ లోపలికి వెళ్లడం లేదు. దీంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లే బస్సుల కోసం జాతీయ రహదారిపైనే నిరీక్షించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అయినా ఆర్టీసీ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

**ప్రయాణికులకు తప్పని పడిగాపులు**

విజయవాడ, హైదరాబాద్, భువనగిరి పట్టణాలకు వెళ్లేందుకు చిట్యాల పట్టణం ముఖ్య కూడలిగా ఉంది. కానీ, ఇక్కడ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఉన్నప్పటికీ బస్సులు లోపలికి వచ్చి వెళ్లడం లేదు. దీంతో ప్రయాణికులు బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న హైవే పైనే పడిగాపులుగాస్తు నిలబడాల్సి వస్తోంది. భువనగిరికి వెళ్లే వాటితోపాటు దిల్‌సుఖ్‌నగర్ వరకు వెళ్లే బస్సులు మాత్రమే ఆర్టీసీ బస్‌స్టేషన్ లోపలికి వచ్చి వెళుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఇమ్లీబన్ వరకు వెళ్లే ఏ బస్సైనా చిట్యాలలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ లోపలికి రావడం లేదు. ముఖ్యంగా సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ ఆర్‌టీసీ డిపోల నుంచి వెళ్లే కొన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు చిట్యాల బస్‌స్టేషన్ లోకి వెళ్లి ఆగి ప్రయాణికులను వెక్కించుకుని వెళ్లాల్సి ఉండగా ఆగకుండానే వెళ్తుండగా, మరికొన్నింటిని మాత్రం బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న హైవేపైనే నిలుపుతున్నారు. దీంతో రోజూ హైదరాబాద్ వైపు వెళ్లే వందలాది ప్రయాణికులు హైవే పైనే బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో హైవే పైన ఆపిన బస్సులను ఎక్కేందుకు ప్రయాణికులు రోడ్డు క్రాసింగ్‌కు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండడంతో రద్దీ పెరిగిందని, హైవే పైనే బస్సులు ఆగుతుండడంతో మహిళలు బస్సులు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్నారని పలువురు అంటున్నారు.

**బస్టాండ్‌లో తాగునీటికి ఇబ్బందులు**

చిట్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బస్‌స్టేషన్ ఆవరణలో తాగునీటిని అందించేందుకు నల్లాలతో కూడిన ట్యాంకు ఉంది. అయినప్పటికి ఆ ట్యాంకుకు నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆ ట్యాంకు నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి అన్ని రకాల బస్సు సర్వీసులు బస్‌స్టేషన్ లోపలికి వచ్చి తమను ఎక్కించుకొని వెళ్లడంతోపాటు బస్‌స్టేషన్‌లో తాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**బస్సులన్నీ బస్టాండ్‌లోకి వచ్చేలా చూడాలి**



హైవేపై ఉన్న చిట్యాల పట్టణం మీదుగా ప్రయాణించే ఆర్టీసీ బస్సులన్నీ స్థానిక బస్‌స్టేషన్‌లో లోపలికి వచ్చి వెళ్లడం లేదు. దీంతో ప్రయాణికులంతా హైవేపైనే ఆపుతున్న బస్సులను ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అన్ని డిపోల బస్సులన్నీ బస్‌స్టేషన్‌లోపలికి వచ్చి వెళ్లేలా చూడాలి.

– కూరెళ్ల శ్రీను, చిట్యాల

## చిరస్మరణీయుడు.. మందడి నర్సింహారెడ్డి

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

**చండూరు:** పేదప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన మందడి నర్సింహారెడ్డి చిరస్మరణీయుడని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మందడి నర్సింహారెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని చండూరులోని గుండ్రపల్లి కూడలిలో ఉన్న నర్సింహారెడ్డి స్మారక స్థూపం, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చండూరు నుంచి పుల్లెంల వరకు బైక్ ర్యాలీగా వెళ్లి పుల్లెంల గ్రామంలో మందడి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన వర్ధంతి సంతాప సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నేత ఉజ్జిని రత్నాకర్‌రావు, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు నలపరాజు రామలింగయ్య, ఆర్ అంజాచారి, తిరుపారి వెంకటేశ్వర్లు, బొల్గూరి నరసింహ, గురుజ రామచంద్రం, బచ్చనగోని గాలయ్య, కురిమిద్దె శ్రీనివాస్, గిరిరాము, మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, బొడ్డు వెంకటేశ్వర్లు, పల్లె యాదయ్య పాల్గొన్నారు.

## ఘనంగా గీతా మందిర బ్రహ్మోత్సవాలు



ప్రవచనాలను వినిపిస్తున్న శివానంద స్వామి

**నకిరేకల్:** నకిరేకల్‌లోని శ్రీమద్భగవద్గీతా మందిర 26వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీసద్గురు మళయాల స్వామివారి విశేష పూజ, గీత ద్వితీయ షట్కం, పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగాశ్రీ సద్గురు శ్రీనిత్యాశుద్ధానందస్వామి క్షేత్రం పీఠాధిపతి శ్రీశివానంద స్వామి, వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు శ్రీలక్ష్మణానందగిరి స్వామి, శ్రీ పరబ్రహ్మానందగిరి మాతాజీ, శ్రీసుధానందగిరి స్వామి భక్తులకు ప్రవచనాలను వినిపించారు. ఉత్సవాలకు సహకరించిన దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమందిర అధ్యక్షుడు పబ్బతి వెంకన్న, ఉపాధ్యక్షుడు మంచుకొండ సోమయ్య, ప్రధాన కార్యదర్శి కొత్తురు వెంకటేశ్వర్లు, ప్రతినిధులు సోమ గీత, కందాల శ్రీనివాస్‌రెడ్డి, వీరవెల్లి రాగ కవిత, పున్న విజయలక్ష్మి, గుండా వెంకటయ్య ,ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి యజమాని పేరుతో డిమాండ్ నోటీసు ఇవ్వాలి



చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**నల్లగొండ టూటౌన్:** నీలగిరి పట్టణంలోని విలీన గ్రామాలతో పాటు శివారు ప్రాంతాల్లో ఎన్నో ఏళ్ల కిందట నిర్మించుకున్న ఇళ్లకు ఆస్తి పన్ను డిమాండ్ నోటీసును ఇంటి యజమాని పేరుతో ఇవ్వాలని సీపీఎం పట్టణ నాయకులు కోరారు. సోమవారం నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. ఇంటి యజమాని పేరు లేకుండా హౌజ్ హోల్డర్ ఆఫ్‌ది ప్రాపర్టీ అని ఆస్తి పన్ను నోటీసులు ఇస్తున్నారని, దీనిని మార్చివేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎండీ. సలీం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాశం, దండెంపల్లి సత్తయ్య, కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నర్సింహ, పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, సరోజ తదితరులు ఉన్నారు.

## కల్యాణ మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



భీమారంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు

**కేతేపల్లి:** మండలంలోని భీమారం గ్రామంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్యస్వామి కల్యాణ మహోత్సవాల పోస్టర్‌ను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి సోమవారం నకిరేకల్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి బడుగుల కవితనరేందర్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కంపసాటి శ్రీనివాస్, మాలధారణ స్వాములు గోద అనిల్, శంకరయ్య, గణేష్, జానయ్య, జిల్లెల రాజు పాల్గొన్నారు.

**మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ**

**కట్టంగూర్:** మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుడుగుంట్ల యాదగిరి తండ్రి నర్సయ్యగౌడ్(60) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాద యాదగిరి, మాజీ సర్పంచ్ ఐతగోని నారాయణ, కుటుంబ సభ్యులు సత్యనారాయణ, జ్యోతి తదితరులు ఉన్నారు.

**ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ**

**నకిరేకల్:** చందంపల్లిలో శ్రీఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే వేముల వీరేశం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూకల రఘునందన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు అందజేయాలి

**నల్లగొండ టూటౌన్:** నల్లగొండ పట్టణంలో అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు కుటుంబసభ్యుల పేర్లు మార్పులు చేర్పులకు అవకాశం కల్పించాలని బీజేపీ పట్టణ కమిటీ కోరింది. సోమవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కంకణాల నాగిరెడ్డి, దాసోజు యాదగిరిచారి, సురేందర్ రెడ్డి, నగేష్, శ్రీనివాస్, సయ్యద్ పాషా ఉన్నారు.

## ముగిసిన విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

**కనగల్:** మండలంలోని చినమాదారం పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో కొనసాగుతున్న హనుమ, గణపతి, నవగ్రహ, సుబ్రహ్మణ్య, రేణుక ఎల్లమ్మ విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను సోమవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా వేద పండితులు ఉదయం గోపూజ, ఆలయ ప్రదక్షిణ, గణపతి పూజ, యంత్రస్థాపన, విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలను విజయవంతం చేసిన భక్తులకు ఎంపీటీసీ మల్లికంటి రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేప నరేందర్‌రెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, చిట్టిమల్ల కోటయ్య, రవి, బసవయ్య, సైదయ్య, లక్ష్మయ్య, దశరథ, మల్లికంటి కృష్ణ, రాము, కోటేశ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ పరీక్షకు 38 మంది

**రామగిరి(నల్లగొండ):** నల్లగొండ పట్టణంలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం జరిగిన సీబీఎస్ఈ సంస్కృతం పరీక్షకు 38 మంది విద్యార్థులు హాజరయ్యారు. కేంద్రానికి 38 మంది విద్యార్థులను కేటాయించగా అందరూ హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

## ఆర్థికసాయం అందజేత

**చిట్యాల:** ఆరెగూడెంలో ఇటీవల మృతిచెందిన సింది అంజయ్య కుటుంబానికి ఆరేకుల సంఘం ప్రతినిధులు సోమవారం రూ.44వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగంపల్లి శ్యాంసుందర్, గ్రామ అధ్యక్షుడు మురాల రామలింగస్వామి, ప్రధానకార్యదర్శి నాగంపల్లి కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. నేరడకు చెందిన లారీ డ్రైవర్ పి.సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గ్రామానికి చెందిన లారీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.23 వేలను సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## బస్సుయాత్రను విజయవంతం చేయాలి



గట్టుప్పల్‌లో మాట్లాడుతున్న దోనూరి వీరారెడ్డి

**గట్టుప్పల్ (చండూరు):** ఈనెల 20నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యే బస్సుయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరోసారి మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

**మునుగోడు:** బీజేపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర ఈనెల 22న మునుగోడుకు చేరుకుంటున్నందున నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్ కోరారు. సోమవారం వారు మునుగోడులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ యాత్రలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో పాటు ఇతర ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో మండల కన్వీనర్ బొడిగె అశోక్‌గౌడ్, బొడ్డు నాగరాజుగౌడ్, నరేందర్, జానయ్య, రాజారాం, జెల్లయ్య పాల్గొన్నారు.

## వైభవంగా శివస్వాముల మహాపడిపూజ



శివుడి మహాపడిపూజకు హాజరైన భక్తులు

**శాలిగౌరారం:** మండలకేంద్రంలోని పార్వతీరామలింగేశ్వరస్వామి దేవాలయం(శివాలయం)లో శివమాలధారులు సోమవారం ద్వాదశ జ్యోతిర్లింగ చతుర్థ మహాపడిపూజ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, మంటపారాధన, రుద్రాభిషేకాలతో ప్రారంభమైన జ్యోతిర్లింగ మహాపడిపూజతోపాటు రాత్రి 9 గంటలకు జరిగిన అగ్నిగుండాల కార్యక్రమంతో ముగిసింది. మహాపడి పూజను వీక్షించేందుకు వివిధ మండలాల భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో మారుమోగింది. అనంతరం ఉత్సవ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఆలయ వంశపారంపర్య అర్చక, పురోహితులు దాచవరం నవీన్‌శర్మ, జగదీష్‌బాబుశర్మ, రాంబాబుశర్మ, శేషభట్టర్ ఆనందాచార్యులు, గురుస్వామి కట్టగూరి వెంకన్నల నేతృత్వంలో పూజాకార్యక్రమాలు జరిగాయి.

## అర్హులకు పింఛన్లు ఇవ్వాలి

**మర్రిగూడ:** అర్హులందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలని సీపీఎం మర్రిగూడ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య కోరారు. సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ బక్క శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ నాయకులు నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య నారోజు అంజాచారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

- విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.



## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



నల్లగొండ : శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న శ్రీరాంసేన ప్రతినిధులు



నల్లగొండలో ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐలు, హిందూవాహిని, ఆర్ఎస్ఎస్ సభ్యులు



చిట్యాల: ఆరెగూడెంలో నివాళులర్పిస్తున్న దైద రవీందర్ తదితరులు

**నల్లగొండ టూటౌన్:** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ శ్రీరాంసేన ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌లో ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రీయ శ్రీరాంసేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జల్లెల గోవర్ధన్ యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొత్త లింగస్వామి, చింత హరిప్రసాద్ పాల్గొన్నారు.

**రామగిరి(నల్లగొండ):** ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సోమవారం నల్లగొండలో హిందూవాహిని ఆధ్వర్యంలో రామగిరిలోని రామాలయం నుంచి శివాజీనగర్‌లోని శివాజీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ బంటు జనార్దన్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, టూ టౌన్ సీఐ కొండల్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ దానియల్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శంకర్, సురేష్,నాగరాజు, హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు తరాల నరేష్, పట్టణ కన్వీనర్ సాయి, ధనుష్, శేఖర్, సతీష్, అనిల్, పవన్ పాల్గొన్నారు.

**నకిరేకల్:** శివాజీ యువసేన ఆధ్వర్యంలో సోమవారం నకిరేకల్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని నిర్వహించారు. యువకులతో పట్టణ పుర వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు.

**నార్కట్‌పల్లి:** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను నార్కట్‌పల్లిలో సోమవారం హిందూవాహిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో హిందూవాహిని ప్రతినిధులు రాజు, మెడబోయిన శ్రీనివాస్, కన్నెబోయిన నర్సింహ, గూడూరు అంజిరెడ్డి, నోముల నాగరాజు, పాలకూరి రమేష్, శివ, మూడు రాజు, రాజేష్, నరేష్, ప్రవీణ్, నవీన్ తదితరులు ఉన్నారు.

**చిట్యాల:** మండలంలోని ఆరెగూడెం గ్రామంలో శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు దైద రవీందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పోకల దేవదాసు, నాయకులు నాగంపల్లి కిషోర్‌కుమార్, శివాజీ యవజన సంఘం అధ్యక్షుడు లింగస్వామి, శ్యాంసుందర్, పిశాటి మాధవ రెడ్డి, శంకర్, శ్రీను, నర్సింహ పాల్గొన్నారు.

**కట్టంగూర్:** మండలంలోని మునుకుంట్ల గ్రామంలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను యువజన సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ముదుసు భిక్షపతి, గద్దగూటి సాయి, గుల్లి నరేష్, జడల శివరాహుల్, ప్రకాశ్ ఉన్నారు.

**మర్రిగూడ:** మర్రిగూడలో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ యువసేన సభ్యులు ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సిలువేరు రఘు, అభి, సందేశ్ రఘు, రోహిత్, విజయ్, శేఖర్, వంశీ, శంకర్, శివరాజ్ ఉన్నారు.

## మాథ్స్ ఒలింపియాడ్‌లో గౌతమి విద్యార్థుల ప్రతిభ

**నల్లగొండ:** శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన మాథ్స్ ఒలింపియాడ్‌లో నల్లగొండలోని గౌతమ్ విద్యా సంస్థల విద్యార్థులు పలువురు రాష్ట్ర స్థాయిలో అవార్డులు సాధించారు. నల్లగొండ బ్రాంచి నుంచి 9వ తరగతి విద్యార్థి ప్రిన్సిరాజ్, 7వ తరగతి విద్యార్థి ఎస్.గౌతమ్, 8వ తరగతిలో గుర్రంపోడు బ్రాంచి విద్యార్థి బి.అనిల్, తిప్పర్తి బ్రాంచి విద్యార్థి ఆర్. విష్ణుప్రియ, 7వ తరగతిలో గుర్రంపోడు బ్రాంచినుంచి విద్యార్థిని ఎం.అక్షయ, 6వ తరగతి విద్యార్థి మనిషారెడ్డి, తిప్పర్తి బ్రాంచి నుంచి 6వ తరగతి విద్యార్థి ఆర్.చరణ్ తేజ్‌లు రాష్ట్ర స్థాయి అవార్డులు గెలుచుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో లోక్ సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ తదితరుల చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులు అందుకున్నారని గౌతమి విద్యా సంస్థల చైర్మన్ రమేష్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎస్.శిరీషారెడ్డి తెలిపారు.



అవార్డులతో గౌతమి విద్యార్థులు

## మెరుగైన సేవలకే 'రిటైల్ ఎక్స్‌పో'



రుణాలు అందజేస్తున్న చీఫ్ జీఎం భాస్కర్‌రావు

**నల్లగొండ టౌన్:** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికే అన్ని ప్రాంతాల్లో రిటైల్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం నల్లగొండలో రిటైల్ ఎక్స్‌పో నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ బ్రాంచి డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్.సత్యనారాయణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డి.వెంకటేశ్వర్లు, ఇతర బ్యాంకు శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విధులు కేటాయించాలి

**నల్లగొండ:** సీనియారిటీ ప్రకారం తమకు ఇంటర్ వార్షిక పరీక్షల్లో విధులు కేటాయించాలని నూతన అధ్యాపకులు కోరారు. సోమవారం డీఐఈఓ దస్రూనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. పాత కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీస్‌ను కలిపి సీనియారిటీని పరిశీలించి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వినతి అందజేసిన వారిలో పలువురు అధ్యాపకులు ఉన్నారు.

## బీఈడీ పరీక్షలు ప్రారంభం

బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని వివిధ సెంటర్లలో మధ్యాహ్నం వేళ నిర్వహించిన ఈ పరీక్షలకు మొదటి రోజు మొత్తం 2,498 మంది అభ్యర్థులకు గాను 2,414 మంది హాజరు కాగా 84 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వాహకులు తెలిపారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, నల్లగొండ



నల్లగొండలో హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు